క్లుప్తంగా

అలరించిన కవి సమ్మేళనం



డిప్యూటీ కలెక్టర్ సవరమ్మను సత్కరిస్తున్న జనజాగృతి ప్రతినిధులు

పలాస: జనజాగృతి సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో ఉగాది సందర్భంగా పలాసలో ఆదివారం జరిగిన కవిసమ్మేళనం అలరించింది. సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ కుమార్‌నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తులాల సవరమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలుగు సంప్రదాయాలను జనజాగృతి వేదిక కాపాడుతోందని ప్రశంసించారు. సమాఖ్య వ్యవస్థాపకులు తెప్పల కృష్ణమూర్తి మాట్లాడుతూ.. తెలుగు సంప్రదాయాలను కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందన్నారు. సాహిత్యం శాశ్వతమైనదని.. ముందుకు తీసుకొని వెళ్లవలసిన బాధ్యత అందరిపైన ఉందని ఆంధ్ర యూనివర్సిటీ అసిస్టెంటు ప్రొఫెసర్ విజయసింహ అన్నారు. కవి సమ్మేళనంలో 42 మంది కవులు తమ స్వీయ కవితలను వినిపించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు హెచ్.వై.దొర, అసిస్టెంటు బీసీ వెల్ఫేర్ అధికారి అప్పారావు, జనజాగృతి కార్యదర్శి కాళిదాసు, బాలరాజు, గిడుగు రామ్మూర్తి కళాపీఠం కన్వీనరు శిష్టు మనోజ్, ప్రముఖ కవులు బమ్మిడి సుబ్బారావు, గుమ్మడి సాంబమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ సవరమ్మతోపాటు పలువురు కవులను సత్కరించారు.

ప్రారంభమైన వసంత నవరాత్రి ఉత్సవాలు



పూజలు చేస్తున్న భక్తులు

కవిటి: మండలంలోని డొంకపుట్టుగలో వసంత నవరాత్రి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఏటా ఈ ఉత్సవాలు సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తుంటారు. సీతారామచంద్రస్వామికి విశేషపూజలు నిర్వహించారు. నవమి వరకు ప్రత్యేక కార్యక్రమాలు జరుపుతారు. చివరిరోజున సీతారాముల కల్యాణాన్ని నిర్వహించడం ద్వారా ఉత్సవాలను ముగిస్తారు.

శ్రీరామనవమి ఉత్సవాలకు శుభరాట



శుభరాట వేస్తున్న దృశ్యం

కంచిలి: మండల కేంద్రం కంచిలిలో శ్రీరామనవమి వేడుకలకు కమిటీ సభ్యులు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా రైల్వేస్టేషన్ ప్రాంగణంలో శుభరాట కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

శునకాలు పీకేస్తున్నాయ్..





కాశీబుగ్గ కేటీ రోడ్డు మధ్యలో కుక్కలు



శ్రీనివాసకూడలి వద్ద ఇలా..

- పలాస–కాశీబుగ్గలో భారీగా పెరిగిన కుక్కలు
- ఆందోళనలో ప్రజలు
- కానరాని నియంత్రణ చర్యలు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులుగా తిరుగుతూ జనంపై దాడులు చేస్తుండడంతో ఇళ్ల నుంచి ఒంటరిగా బయటకు రావడానికి భయపడుతున్నారు. కొద్దిరోజుల క్రితం వరకూ వీధుల్లో అక్కడక్కడ కనిపించే కుక్కలు ప్రస్తుతం గుంపులుగా తిరుగుతూ పాదచారులు, ద్విచక్ర వాహనదారులపై దాడి చేస్తున్నాయి. నిలబడి ఉండేవారి కాళ్లను పీకేస్తున్నాయి. ఇటీవల కుక్కకాటు బాధితులు పట్టణంలో బాగా పెరిగిపోయారు. అకస్మాత్తుగా కుక్కలు రోడ్లపైకి వస్తుండడంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. ఇంత జరుగుతున్నా మున్సిపల్ అధికారులు వీటి నియంత్రణపై దృష్టిసారించడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

పట్టణంలో ఇలా..

పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో 16 సచివాలయాల పరిధిలో 31 వార్డులు ఉన్నాయి. ప్రధానంగా కేటి రోడ్డులో హోటళ్లు, ఫాస్టుఫుడ్ సెంటర్లు, చిన్నచిన్న టిఫిన్ కొట్లు, తినుబండారాల వ్యాపార కేంద్రాలు ఎక్కువగా ఉన్నాయి. వీటి చుట్టూ కుక్కలు మందలుగా చేరుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది నెలల్లో ఒక్కసారి కూడా వీటి నియంత్రణకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. మున్సిపల్ సమావేశాల సమయంలో మాత్రం కుక్కల నియంత్రణకు నిధులు కేటాయిస్తున్నట్టు చెబుతున్నా ఆ పరిస్థితి ఎక్కడా లేదు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ, గ్రామీణ ప్రాంతాల నుంచి రోజుకు కనీసం మూడు కుక్కకాటు కేసులు పలాసలోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి చికిత్స కోసం వస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ పాపినాయుడు తెలిపారు. ఒక్క మార్చి నెలలోనే 51 కుక్కకాటు కేసులు వచ్చాయంటే ఇక్కడ పరిస్థితి ఎంత భయంకరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. గత పది నెలల్లో సమారు 120 కేసులు నమోదయ్యాయి. వీటిలో శీతాకాలంలో అధిక కేసులు ఉన్నాయి.

పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు..

కుక్కలతో కొత్త చిక్కులు వస్తున్నాయి. రోడ్లపై గుంపులుగా ఉంటున్న శునకాలు పాదచారులు, ద్విచక్ర వాహనదారులు, కార్ల వెంటపడుతున్నాయి. వీటి నుంచి తప్పించుకునే క్రమంలో చాలామంది ప్రమాదాలకు గురై ఆస్పత్రిపాలవుతున్నారు. అలాగే రోడ్ల మధ్యలో మందలుగా ఉంటుండడంతో ఏమరపాటుగా ఉన్నా, చీకట్లో గమనించకుండా వెళ్తున్న వాహనాదారులు వాటిని ఢీకొని పడిపోతున్నారు. కాశీబుగ్గ కేటీ రోడ్డులో ఇలాంటి సంఘటనలు ఇటీవల చాలా చోటుచేసుకున్నాయి. చికెన్, మటన్ విక్రయ కేంద్రాల యజమానులు వాటి వ్యర్థాలను కాలువలు, రోడ్ల పక్క వేస్తుండడం.. వాటిని తినడానికి వస్తున్న కుక్కలు జనం కనిపిస్తే కాటు వేస్తున్నాయి.

తక్షణ చర్యలు చేపట్టాలి



కుక్కల బెడద అధికమైంది. గుంపులుగా జనంపై దాడులకు పాల్పడుతున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో అనేక ప్రాంతాలలో గొర్రెల మందలపై కూడా దాడి చేసి చంపేసిన సంఘటనలు ఇటీవల చోటుచేసుకున్నాయి. మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి కుక్కల నియంత్రకు చర్యలు తీసుకోవాలి.

– వల్లబ వైకుంఠరావు, రెండోవార్డు, నెమలినారాయణపురం

నాలుగు రోజుల్లో నియంత్రిస్తాం



మున్సిపాలిటీలో కుక్కలు అధికంగా ఉండటం వాస్తవమే. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణంలోని వచ్చేస్తున్నాయి. ఇటీవల కర్నూలు, చిత్తూరు ప్రాంతాలకు చెందినవారు పంచాయతీ పరిధిలో కుక్కలను పట్టి వాటిని మున్సిపాలిటీ పరిసరాల్లో విడిచి పెట్టినట్లు పక్కా సమాచారం ఉంది. కాశీబుగ్గ, పలాస జంట పట్టణాలలో కుక్కల నియంత్రణకు ఉన్నతాధికారులతో చర్చించి నాలుగు రోజులలో నియంత్రిస్తాం.

– నడిపేన రామారావు, కమిషనర్, పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ



కాశీబుగ్గలో ఓ హోటల్ వద్ద..



రోటరీనగర్ పాడుబడిన జీడి పరిశ్రమ వద్ద..

చంద్రశేఖరస్వామికి జలాభిషేకం

కవిటి: మండలకేంద్రం కవిటిలో సొండి కులసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం విశ్వావసు నామ సంవత్సర ఉగాది సంబరాలు ఘనంగా జరిగాయి. వారంతా సంప్రదాయ వస్త్రధారణలో పవిత్ర జలాల్ని శోభాయాత్రగా తలపై తీసుకువెళ్లి చంద్రశేఖరస్వామికి జలాభిషేకం చేసి మొక్కులు చెల్లించుకున్నారు.



శోభాయాత్రలో మహిళలు

22 మద్యం కేసులు నమోదు

ఇచ్ఛాపురం టౌన్: ఇచ్ఛాపురం ఎక్సైజ్ పోలీసుస్టేషన్ మద్యం, గంజాయి అక్రమ రవాణాకు సంబంధించి మార్చి నెలలో 22 కేసులు నమోదు చేసినట్టు సీఐ పి.దుర్గాప్రసాద్ ఆదివారం తెలిపారు. అలాగే ఒక కారు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఆర్థిక సాయం..



పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన ఇచ్చాపురం సాయిక్రిష్ణ పక్షవాతంతో బాధపడుతున్నారు. ఈయన పలాస మండలం బొడ్డపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకున్నను. ఈ విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థి కిక్కర డిల్లీరావు అండగా నిలించారు. సాయిక్రిష్ణకు ఆదివారం పది వేల రూపాయలను అందజేసి ఆదర్శంగా నిలిచారు.

–కాశీబుగ్గ

పురస్కారం ప్రదానం



కవిటి మండలం బెజ్జిపుట్టుగ చక్రధర పెరుమాళ్ దేవస్థానం ప్రధాన అర్చకులు బాలక సత్యన్నారాయణ స్వామి అరుదైన గౌరవం దక్కింది. జిల్లాస్థాయి ఉగాది పురస్కారానికి ఎంపికయ్యారు. శ్రీకాకుళం పట్టణ సమీపంలోని అరసవల్లి సూర్యనారాయణస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఉగాది వేడుకల్లో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ చేతుల మీదుగా సత్యన్నారాయణ స్వామి అవార్డును అందుకున్నారు.

–కవిటి

సూర్యనారాయణస్వామికి ప్రత్యేక పూజలు



టెక్కలిలోని సూర్యనారాయణ స్వామి ఆలయం ఆదివారం భక్తులతో కళకళలాడింది. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని స్వామివారిని అధికసంఖ్యలో భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. భారీగా వచ్చిన జనంతో పట్టణంలో ఆధ్యాత్మిక వాతావరణం చోటు చేసుకుంది.

–టెక్కలి

చలివేంద్రాలు ప్రారంభం



ఇచ్ఛాపురం రూరల్: చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నారాయణమ్మ



సోంపేట: పర్యాటకులకు మజ్జిగ అందజేస్తున్న మెరైన్ సీఐ రమేష్‌కుమార్, ఎస్సై శిరీష

ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం గ్రామంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ ఆదివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి, పెద్దరెడ్డి నీలాద్రిరెడ్డి, మోహనరావురెడ్డి, శ్యామ్‌సుదర్‌రెడ్డి, చంద్రశేఖరంరెడ్డి పాల్గొన్నారు.

సోంపేట: బారువ సముద్ర తీరానికి సేదతీరేందుకు వచ్చే పర్యాటకుల కోసం మెరైన్ పోలీస్ స్టేషన్ సమీపంలో చలివేంద్రాన్ని సీఐ రమేష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత, స్వచ్ఛంద సంస్థలు ప్రత్యేక కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటుకు ముందుకు రావాలని కోరారు. తొలిరోజున మజ్జిగను ప్రారంభించారు. ఎస్సైలు శిరీష, శ్రీనివాస్, ఏఎస్సైలు కోదండం, మాధవరావు ఉన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

కాశీబుగ్గ: ఉగాది సందర్భంగా స్థానిక శిష్టకరణ సేవా సంఘం ఆధ్వర్యంలో నిరుపేదలకు నిత్యావసర సరకులు, దుస్తులు పంపిణీ చేశారు. పలాస–కాశీబుగ్గ జంట పట్టణాల్లో ఉన్న నిరుపేదల ఇళ్ల వద్దకు వెళ్లి సామగ్రి అందించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు విజయకుమార్ పట్నాయక్, డబ్బీరు నాగభూషణరావు, ఎస్.ప్రసాదరావు, మహంతి, శ్రీనివాసపట్నాయక్, భాస్కరరావు ఉన్నారు.



సరుకులు అందజేస్తున్న సంఘ సభ్యులు

ఆటో కార్మికులకు యూనిఫాం అందజేత

కంచిలి: మండల కేంద్రం కంచిలిలోని విజ్ఞాన్ స్కూల్ నిర్వాహకులు ఉగాది సందర్భంగా 32 మంది ఆటో కార్మికులకు ఖాకీ రంగు యూనిఫారాలను ఆదివారం పంపిణీ చేశారు. స్కూల్ కరస్పాండెంట్ సీహెచ్ ఆదినారాయణ, ప్రిన్సిపాల్ ఉమ, సిబ్బంది పాల్గొన్నారు.



యూనిఫారాలు అందజేస్తున్న దృశ్యం

గణితావధానికి సత్కారం

పలాస: గణితావధాని మడ్డు తిరుపతిరావుకు పలాస జనజాగృతి సాహితీ సాంస్కృతిక సమాఖ్య ఆదివారం ఘనంగా సత్కరించింది. పలాసలో జరిగిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టరు సవరమ్మ, జనజాగృతి అధ్యక్షులు కుమార్‌నాయక్ పాల్గొన్నారు.



తిరుపతిరావును సత్కరిస్తున్న దృశ్యం

మజ్జిగ వితరణ

కాశీబుగ్గ: పలాసలోని శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా స్థానిక ఆర్టీసీ డిపో, కాంప్లెక్స్‌లోని ప్రయాణికులు, సిబ్బందికి మజ్జిగ పంపిణీ చేశారు.



ఆర్టీసీ సిబ్బందికి మజ్జిగను అందజేస్తున్న దృశ్యం

‘విశ్వావసు’కు స్వాగతం పలుకుతూ..

పల్లె పరవశించింది. విశ్వా వసు నామ సంవత్సరానికి ఘన స్వాగతం పలికింది. ఉగాది పండుగను ఆదివారం సంప్రదాయబద్ధంగా ప్రజలు జరుపుకున్నారు. వేకువ జామునుంచే ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. రైతులు ఏరువాక ప్రారంభించి ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు కలిసి రావాలని మొక్కుకున్నారు. ఆలయాలు, రచ్చబండల వద్ద పండితులు పంచాంగ శ్రవణాన్ని వినిపించగా అందరూ ఆసక్తిగా ఆలకించారు. కవిసమ్మేళనాలు నిర్వహించి..కవులను సత్కరించారు. కార్యక్రమాలకు హాజరైన వారిలో చాలామంది పంచెకట్టులో ఆకట్టుకున్నారు. షడ్రుచులతో తయారు చేసిన ఉగాది పచ్చడిని స్వీకరించారు. చిన్నారులు సైతం ఆటపాటలతో అలరించారు.

–సాక్షి నెట్‌వర్క్



ఇచ్ఛాపురం రూరల్: ఎం.తోటూరు ప్రాథమిక పాఠశాలలో ఉగాది వేడుకలు



ఇచ్ఛాపురం రూరల్: టి.బరంపురం రామాలయంలో పంచాంగ శ్రవణంలో ప్రజలు



టెక్కలిలో సాహిత్య సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన ఉగాది వేడుకల్లో రచయిత బి.ఆనందరావు రచించిన సత్య సూర్య శతకాన్ని ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు



సోంపేట: తెలుగు సంవత్సరాల పేర్లతో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న చిన్నారులు



కంచిలి: మండపల్లిలోని వానప్రస్థాశ్రమంలో ఉగాది వేడుకలు



కవిటి: కవిటి చంద్రశేఖర ఆలయంలో పంచాంగ శ్రవణంలో రైతులు



కవిటి: ప్రగడపుట్టుగ కోదండరామాలయంలో పంచాంగ శ్రవణం



ఇచ్ఛాపురం టౌన్: కన్యకాపరమేశ్వరి దేవాలయంలో తెలుగు క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న వీహెచ్‌పీ సభ్యులు



కంచిలి: ఎమ్మెల్సీ కార్యాలయంలో పంచాంగ శ్రవణంలో శాసనమండలి సభ్యుడు నర్తు రామారావు తదితరులు



ఇచ్ఛాపురం: జ్ఞానభారతి పాఠశాల ఆవరణలో కవులకు సత్కారం



మందసలో చిన్నారుల సందడి..



టెక్కలి: వాసవి కన్యకా పరమేశ్వరి కళింగ కోమటి సంఘం ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం



కాశీబుగ్గ: బ్రహ్మణతర్లాలో ఏరువాక ప్రారంభించిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులు ఆసపాన మధుబాబు



కాశీబుగ్గ: శ్రీగురుకుల పాఠశాలలో తెలుగు క్యాలెండర్ ఆవిషణలో వీహెచ్‌పీ ప్రతినిధులు



నందిగాంలో పంచాంగ శ్రవణం చేస్తున్న పురోహితులు

వేడుకగా బడ్డిపోలమ్మ జాతర



కాశీబుగ్గ: పలాసలోని బడ్డిపోలమ్మ అమ్మవారి జాతర ఆదివారం ఘనంగా జరిగింది. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.